# వాక్ క్షేత్రం-I

-బ్రహ్మర్షి పత్రీజీ



# “వాక్ క్షేత్రం-I”

మానవ జీవితం త్రిక్షేత్రమయం !

మానవ ప్రపంచం త్రిక్షేత్రాత్మకం!

మానవ జీవితంలోని ఈ మూడు క్షేత్రాల గురించి సంపూర్ణంగా తెలుసుకుందాం.

“త్రిక్షేత్రం” అంటే “మూడు క్షేత్రాలు”.

“త్రిక్షేత్రమయం” అంటే “మూడు క్షేత్రాలలో నిండి ఉంది” అని అర్థం.

మానవ జీవితం అంతా ఈ మూడు క్షేత్రాలలోనే వుంది.

మానవ ప్రపంచం అంతా కూడా ఈ త్రిక్షేత్రాలతోనే విరాజిల్లి ఉంది.

ఆ మూడు క్షేత్రాలూ.........

| | | |
|---|---|---|
| 1. భావనా క్షేత్రం | - | ఆలోచనా క్షేత్రం |
| 2. వాక్ క్షేత్రం | - | మాటల క్షేత్రం |
| 3. చేష్టా క్షేత్రం | - | కర్మ క్షేత్రం |

కనుక మానవ జీవితం త్రిక్షేత్రయమం. అంటే

1. భావనలు 2. వాక్కులు 3. చేష్టలు

భావనలు అంటే ఇంగ్లీషులో Thoughts.

వాక్కులు అంటే ఇంగ్లీషులో Words.

చేష్టలు అంటే ఇంగ్లీషులో Deeds.

ఈ మూడు కూడా మానవ జీవితంలో విస్తారమై వున్నాయి. “మానవ జీవితం” విస్తారమైన “భావనల క్షేత్రం”; విస్తారమైన “వాక్ క్షేత్రం”; విస్తారమైన “చేష్టాక్షేత్రా”లతో నిండి ఉంది.

చుట్టుప్రక్కల ఉండే మనుష్యులందరిలో కూడా ఈ మూడు క్షేత్రాలు వున్నాయి.

భావనాక్షేత్రం, వాక్ క్షేత్రం, చేష్టాక్షేత్రం ఈ మూడు క్షేత్రాలతో మానవ ప్రపంచం నిండి వుంది.

ఇప్పుడు మనం ఈ మూడు క్షేత్రాల యదార్థ పరిస్థితిని తెలుసు కుందాం.

ఇది జీవితంలో చాలా ముఖ్యమైన అంశం.

ప్రతి మానవుడూ తన స్వంత జీవితాన్ని అర్థం చేసుకుంటేనే కానీ జీవితంలో ఆనందాన్ని పొందలేడు. సమర్థతకి నోచుకోలేడు. కనుక "తాను ఏమిటో?" తాను తెలుసుకోవాలి.

"Man Know thy Self" అని అన్నాడు జీసస్ క్రైస్ట్!

"నిన్ను నువ్వు తెలుసుకో" అని అన్నాడు గౌతమ బుద్ధుడు.

మనల్ని మనం తెలుసుకోవడం అంటే "నేను" ను గురించి తెలుసుకోవడం అన్నమాట! "నేను" అన్నది మూడు క్షేత్రాల మయం!

నన్ను నేను తెలుసుకోవాలంటే నా భావనాక్షేత్రం గురించీ, నా వాక్‌క్షేత్రం గురించీ, నా చేష్టాక్షేత్రం గురించి తెలుసుకోవాలి!

నన్ను నేను తెలుసుకున్నప్పుడు ఈ ప్రపంచం అంతటి గురించి నేను తెలుసుకోగలను. ఎందుకంటే అక్కడా ఇవే వున్నాయి!

నన్ను నేను తెలుసుకుంటే ప్రపంచాన్ని తెలుసుకున్నట్లే!

నన్ను నేను జయిస్తే ప్రపంచాన్ని అంతటినీ జయించినట్లే!

నాతో నేను హాయిగా జీవించగలిగితే ప్రపంచంలో ఎక్కడైనా హాయిగా జీవించగలను!

నాతో నేను హాయిగా జీవించకపోతే, శాంతిగా వుండలేకపోతే ప్రపంచంలో ఎక్కడైనా ఎవ్వరితోనైనా హాయిగా, శాంతంగా వుండడం అన్నది అసంభవం. కనుక "Know thy Self" అంటే "నా జీవితం గురించి నేను తెలుసుకోవడం" అన్నమాట.

మానవుడికి వున్నవి - ఆలోచనలు, మానవుడికి వున్నవి - వాక్కులు, మానవుడికి వున్నవి - చేష్టలు, దీనినే మనం 'మనసా' 'వాచా' , 'కర్మణా' అని అంటున్నాం.

'మనస్సు' అన్నది ఆలోచనల సమూహం!

'వాచా' అన్నది వాక్కుల సమూహం!

'కర్మలు' అన్నవి చేష్టల 'సమూహం'!

మనసా, వాచా, కర్మణా... వీటి గురించి వివరంగా సమూలంగా అమూలాగ్రంగా, నఖశిఖ పర్యంతం తెలుసుకుందాం!

**"భావనాక్షేత్రం"!**

మొట్టమొదటగా మనం భావనా క్షేత్రాన్ని తీసుకుందాం! దీనినే మనం "ఆలోచనల క్షేత్రం" అని అంటున్నాం. దీనిలో మన ఆలోచనలూ,

మన ఊహలూ ఉంటాయి. ప్రతి ఒక్కరికీ ఈ భావనాక్షేత్రం వుంది. అందులో ఎంతో కొంత విహరిస్తూ వుంటాం. అందులో ఎంతో కొంత జీవిస్తూ వుంటాం. ఏదో రకంగా! మన ఆలోచనలు రకరకాలుగా వుంటాయి. మన భావనలు రకరకాల - స్థాయిల్లో విహరిస్తూ వుంటాయి. మన భావనలు 'పక్షులు' లాంటివి. ఆ విశాల గగనంలో ఎక్కడా అడ్డు వుండదు. కనుక ఎక్కడైనా విహరించవచ్చు. మన భావనా ప్రపంచం అన్నది - ఆస్ట్రల్ ప్రపంచం. ఇక్కడ తప్పలు లేవు, ఒప్పలు లేవు. మన భావనలలో దోపిడీలు చేయవచ్చు. దొంగతనాలు చేయవచ్చు. అక్రమాలు చేయవచ్చు. ఢిల్లీ సుల్తాన్ కావచ్చు. రామానుజాచార్యులు కావచ్చు. ఏదైనా కావచ్చు. ఎవ్వరూ "ఏమిటీ నీ ఆలోచనలు అలా వున్నాయి! ఇలా వున్నాయి!" అని ప్రాసిక్యూట్ చెయ్యజాలరు. జడ్జిమెంటు ఇవ్వరు. కోర్టులో కేసు పెట్టరు. ఎందుకంటే అవి ఆలోచనలు, ఆస్ట్రల్ వరల్డ్‌కి సంబంధించినవి. భౌతిక ప్రపంచానికి సంబంధించినవి కావు.

## "ఎవరికి వారే భావే తీరే!"

మన భావనా ప్రపంచంలో మనం ఇష్టం వచ్చినట్లు విహరిస్తూ ఉంటాం! మన భావనా ప్రపంచంలో మనం సర్వస్వతంత్రులం! ఈ భావనా ప్రపంచం అన్నది అత్యంత సృజనాత్మక క్షేత్రం, క్రియేటివ్ వరల్డ్! ఈ భావనా ప్రపంచంలో రకరకాల విషయాలను సృష్టిస్తూ వుంటాం. రకరకాల పరిస్థితులలో వుంటూంటాం. ఈ భావనా ప్రపంచంలో క్రమ, అక్రమాలు లేవు; న్యాయన్యాయాలు లేవు; ధర్మాధర్మాలు లేవు; తప్పొప్పలు లేవు; సరైనది, సరికానిది అన్న ద్వందాలు లేవు! కనుక ఒక ఆలోచనలను ఇంకొకరు పట్టించుకోరు. అవి పట్టించుకునే స్థితిలో లేవు. పట్టించుకునే స్థితి లేని వాటిని పట్టించుకోవడం అన్నది సరైన స్థితి కాదు. ఎవరి భావనా పరిమ ఎలా వుంటుందో వారి భావనా ప్రపంచం అలా సిద్ధిస్తుంది. ఎవరి భావనా రీతి ఎలా వుంటుందో వారి భావనా ప్రపంచం అలాగే రూపుదిద్దుకుంటుంది.

అంటే, ప్రతి మనిషి కూడా ఈ మొదటి ప్రపంచం అయినా భావనాక్షేత్రంలో, భావనా ప్రపంచంలో సర్వస్వతంత్రుడు. అక్కడ "యధేచ్ఛసి తథాకురు" అంటే నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి - నీ భావనా ప్రపంచంలో!

ఎవ్వరూ ఎవ్వరికీ అడ్డు కారు! ఏదీ అడ్డు కాదు! ఏదీ అసందర్భం

కాదు! ఏదీ అసమంజసం కాదు! ఏదీ ప్రేలాపన కాదు! ఎవ్వరి ఇష్టం వాళ్ళదీ! మన ఇష్టారాజ్యన్ని ఏలుకుంటాం మన భావనా ప్రపంచంలో! "నా తల్లి అలా ఎందుకు అలా ఆలోచిస్తుంది?" అని అడగడానికి లేదు - ఆమె ఇష్టం ఆమెది. ఆమె ఆలోచనలు ఆమెవి. ఆమె ఇష్టం. నా శత్రువు ఎందుకు అలా ఆలోచిస్తున్నాడు? కాదు! వాడి భావనా ప్రపంచంలో వాడి ఇష్టం. "మనం ఇలా ఆలోచిస్తున్నాం; మరి వాళ్ళెందుకు అలా ఆలోచిస్తున్నారు?" అని కాదు. మనల్ని బట్టి వాళ్ళు కాదు. వాళ్ళని బట్టి వాళ్ళు వుంటారు. మన ఆలోచనా ప్రపంచం మనలోంచి పుడుతుంది. వాళ్ళు ఆలోచనా ప్రపంచం వాళ్ళలో నుంచి పుడుతుంది. ఎవరెవరి భావనా ప్రపంచంలో, వాళ్ళ ఆలోచనలలో వాళ్ళకి వాళ్ళు సర్వస్వతంత్రులు.

ఒక విధంగా ఆలోచించాం అనుకోండి...... ఒకళ్ళని చంపాలి. చంపాలి అని ఆలోచిస్తున్నారనుకోండి. ఆ ఆలోచనలలోనే నేను చనిపోతే పైలోకాలకు వెళ్ళినప్పడు "ఎందుకు అలా ఆలోచించావు?" అని ఎవ్వరూ అడగరు అక్కడ.

As above, so below! ఇక్కడ మనం ఎలా వాటిని మనం పట్టించుకోమో అక్కడ కూడా వాళ్ళు అంతకన్నా పట్టించుకోరు. అక్కడ మనల్ని ఎవ్వరూ అడుగరు. "ఎందుకు అలా ఆలోచిస్తున్నావు" అని చెప్పి, కనుక మన ఆలోచనలకు మనం ఎంత మాత్రం సిగ్గుపడాల్సిన పని లేదు! "నీ ఆలోచనలు కంట్రోలు చేసుకో! కంట్రోలు చేసుకో!" అని మన వేదాంతంలో చెప్తూ వుంటారు. మన ఆలోచనల్ని కంట్రోలు చేసుకోవాల్సిన అవసరం లేనే లేదు! ఆ అగత్యం లేదు! అలాంటి అవసరం లేదు!

వేదాంత ధోరణిలో, ప్రాచీన భారతదేశ సాంప్రదాయాల్లో "ఆలోచనల్ని కంట్రోలు చేసుకో"మని చెప్పారు. అయితే అది ఎంత మాత్రం సత్యం కాదు. ఎక్కడ కంట్రోలు చెయ్యాలో అక్కడ కంట్రోలు చెయ్యాలి కానీ, ఎక్కడ కంట్రోలు చెయ్యనవసరం లేదో అక్కడ కంట్రోలు చేయనవసరం లేదు.

మనం ఒక సినిమా చూస్తూ వుంటే ఆ సినిమా హీరోయిన్ పై కోరిక పుడుతుంది. మన భావనా ప్రపంచంలో అనుభవిస్తాం "అది తప్పు" అని వేదాంతం మనకి బోధిస్తోంది; "కాదు, అది ఒప్పు" అని ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞానం బోధిస్తుంది! వేదాంత శాస్త్రం అన్నది నాల్గవ అనాహత చక్రానికి సంబంధించినది.

మిడి మిడి జ్ఞానులు వేదాంతులు. సంపూర్ణ జ్ఞానంతో ఆరితేరిన వారు సహస్రార స్థితిలోని వారు! కనుక వేదాంతం వైరాగ్యం బోధిస్తుంది. ఆలోచనలను క్రమంలో పెట్టుకోమని చెప్తుంది. ఆలోచన దుమారం లేపుతుందని చెప్తుంది. ఆలోచనలను చెలరేగ నివ్వద్దని చెప్తుంది. ఇదంతా ఎంత మాత్రం సత్యం కాదు! ఇది సత్యసుదూరం- సత్య విరుద్ధం! వేదాంతులకు అది అర్థం కాదు. సామాన్య ప్రజానీకానికి ఇది అర్థం కాదు! మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర చక్రాలలో వున్న పండితులకు ఇది అర్థం కాదు! విశుద్ధ చక్రంలో వున్న యోగులకూ ఇది అర్థం కాదు! అజ్ఞాచక్రంలో విహరిస్తున్న ఆత్మజ్ఞానులకే ఇది అర్థం అవుతుంది. దీనిని చాలా చక్కగా అర్థం చేసుకోవాలి.

ఉదా: లోయర్ స్థితిలో, అంటే అల్ప స్థితిలో ఏది సత్యం అనుకుంటామో అది ఉన్నత స్థితిలో అసత్యం అయిపోతుంది. న్యూటన్ ఇలా అన్నాడు. "The shortest distance between two points is straight line" అని కానీ, ఇది ఐన్‌స్టీన్ దగ్గరకు వచ్చేసరికి "The shortest distance between two points is a curve" అని అన్నాడు. ఇది స్పేస్ ఫిజిక్స్ తెలిసిన వాళ్ళకే ఇది అర్థం అవుతుంది. తెలియని వాళ్ళకు అర్థం కాదు. 'క్వాంటమ్ ఫిజిక్స్'లో "Every thing is uncertain!" కానీ "Newtonion physics లో వచ్చేసరికి "Every thing is Certain."

అలాగే ఆలోచనలలో తప్పొప్పులు వున్నాయని అన్నారు అల్పజ్ఞులు! ఆలోచనల్లో ఏ మాత్రం తప్పొప్పులు లేవని అన్నారు సర్వజ్ఞులైన వున్నతులు! ఎవ్వరూ కూడా తమ తమ భావనా ప్రపంచాల్లో తప్పు చేస్తున్నామని సిగ్గుపడరాదు. ఆ క్షేత్రంలో గిల్టీ కాన్షస్‌నెష్ అన్నది కూడదు.

ఎక్కడ గిల్టీ కాన్షస్‌నెస్ వుండాలో అక్కడ వుండాలి. భావనాక్షేత్రంలో, ఆలోచనాక్షేత్రంలో గిల్టీ కాన్షస్‌నెస్ అన్నది కూడదు. అక్కడ సూత్రం ఏమిటంటే "యధేచ్ఛసి తథాకురు" అంటే "నీ ఇచ్ఛ ఎలా వుందో అలా చెయ్యి........" నీ భావనా ప్రపంచంలో.....! అని ఈ పదాలు శ్రీకృష్ణుడు కురుక్షేత్రంలో చెప్పాడు! అవి భావనాక్షేత్రంలోనూ పనికివస్తాయి! అయితే 'కురు' క్షేత్రంలోనూ పనికి వస్తాయి. అది నేను ముందు ముందు చెప్తాను. "కురు క్షేత్రం" అంటే "కర్మ క్షేత్రం" , అంటే "చేష్టా క్షేత్రం" అందులోనూ ఈ సూత్రం పనికి వస్తుంది. భావనాక్షేత్రంలో కూడా ఇదే సూత్రం పనికి వస్తుంది.

భావనా క్షేత్రంలో దేనిని పుట్టించడమైనా, దేనిని చంపడమైనా, చేసెయ్యి. అక్కడ మానం చెయ్యి, అవమానం చెయ్యి! నీ ఇష్టం! అక్కడ వున్నవి అన్నీ సృజనాత్మక చర్యలే కానీ, క్రియాశీలక చర్యలు కావు. ఇంకా కారణలోకాలలోనే ఈ భావనా ప్రపంచం వుంది కానీ ఇంకా కార్య లోకాలలోకి రాలేదు. అంచేత ప్రాసిక్యూషన్ వుండదు. కార్యం అన్నదే ప్రాసిక్యూషన్ చేయబడుతుంది కానీ కారణం కాదు. కనుక, కారణం కారణస్థితిలోనే వున్నప్పుడు అది ఎవ్వరి జడ్జిమెంటుకి అందదు.

జీసస్ క్రైస్ట్ అన్నారు......"Judge ye not" అని! ఎవ్వరిని కూడా జడ్జి చెయ్యవద్దని చెప్పారు. ఈ మూడు మాటలలో సమస్త ఆత్మవిజ్ఞానం నిబిడీకృతం అయి వుంది! ఆ మూడు పదాలూ సహస్రారస్థితి నుంచి వచ్చాయి! అవి అనాహత చక్రం నుంచో విశుద్ధ చక్రం నుంచో, ఆజ్ఞా చక్ర స్థితి నుంచో రాలేదు. సహస్రార స్థితిలో నుంచి వచ్చిన వాళ్ళే అర్థం చేసుకుంటారు? ఒక కార్పోవ్ ఎవరో కొద్దిగా చెస్ నేర్చుకున్న వాళ్ళకు తెలియజాలడు. ఒక world champion ని ఇంకొక వరల్డ్ ఛాంపియన్ మాత్రమే అర్థం చేసుకోగలడు.

జీసస్ క్రైస్ట్ మాటల్ని, జీసస్ క్రైస్ట్ స్థితిలో వున్న వాళ్లు మాత్రమే అర్థం చేసుకోగలరు తప్ప, సామాన్య ప్రజలు అర్థం చేసుకోలేరు. అది అంసంభవం.

జడ్జి చెయ్యవద్దు! ఎవ్వరిని; మీ ప్రక్కవాళ్ళని!
ఎవరు మీ ప్రక్కవాళ్ళు! వాళ్ళు కూడా మూడే!
మీరు ఏవిధంగా మూడో, వారూ కూడా మూడే!
ప్రక్క వాడు మూడు అంటే వాడి మూడు! అంటే!
వాడి భావనాక్షేత్రం.
వాడి వాక్ క్షేత్రం.
వాడి చేష్టాక్షేత్రం.
ఎవరిని జడ్జి చేయడానికీ ఎవరికి అర్హత లేదు.

కనుక జీసస్ క్రైస్ట్ యొక్క వాక్‌క్షేత్రం నుంచి వచ్చిన వాక్కులు అద్భుతమైనవి. అవి సత్య వాక్కులు.

కృష్ణుడి వాక్‌క్షేత్రం నుంచి వచ్చిన వాక్కులు ఎంత అద్భుత వాక్కులో! కనుక, జీసస్ చెప్పినవి, శ్రీ కృష్ణుడు చెప్పినవి, బుద్ధుడు చెప్పిన వాక్కులు, వారి వారి వాక్‌క్షేత్రం నుంచి ప్రసరించినవే! వారు ఏం

చెప్పారంటే ఎవ్వరి ఆలోచనలనూ పట్టించుకోవద్దు. అవి సృజనాత్మక మైనవి. క్రియాశీలకమైనవి కావు! అందులో వారికి సర్వస్వతంత్రం వుంది. హాని చెయ్యవచ్చు; కీడు చెయ్యవచ్చు; లాభం చెయ్యవచ్చు! నష్టం చెయ్యవచ్చు! అది వారి వారి ఇష్టం.

ఇకపోతే మిగతా రెండు క్షేత్రాల గురించి తెలుసుకుందాం!

అవి వాక్‌క్షేత్రం, చేష్టాక్షేత్రం. అయితే రెండవక్షేత్రం వదిలి పెట్టి ఈ మూడవ క్షేత్రమైన 'చేష్టాక్షేత్రం" చూద్దాం! ఆ తర్వాత 'వాక్ క్షేత్రం" గురించి చూద్దాం!

## "చేష్టాక్షేత్రం!"

ఏమిటి ఈ చేష్టాక్షేత్రం? ఇదే కురుక్షేత్రం! అదే కర్మక్షేత్రం! "కురు" అనే ధాతువు నుంచి వచ్చింది. మనం చేసే కార్యలు అన్నీ కురుక్షేత్రానికి సంబంధించినవి. అంటే, తినడం, త్రాగడం, చంపడం, కొట్టడం.......... ఇలాంటి రకరకాల పనులు చేయడం.

ఏ పనిని ఈ శరీరంతో చేసినా దానిని "కురుక్షేత్రం" అని అంటాం! చేష్టలు మాటలతో కూడుకుని వున్నవైనా, మాటలను మాత్రం మనం విడిగా తీసివేస్తున్నాం. చేష్టలను దూరం చేసి, మాటలు కాని చేష్టలను చేష్టా ప్రపంచాన్ని మనం అర్థం చేసుకుంటున్నాం.

ఉదా: అర్జునుడు ద్రోణునిని చంపాలి. అది ఒక చేష్ట. లేదా అభిమన్యుడు ఉత్తరను పెళ్ళి చేసుకోవాలి. అది ఒక చేష్ట.

ఉద్యోగం చేయాలి
పిల్లల్ని కనాలి
డబ్బు సంపాదించాలి
భోగించాలి........

ఇవన్నీ కూడా చేష్టలు! మనం క్రియారూపకంగా ఏది చేసినా దానిని మనం చేష్ట అని అంటాం. ఎలాగైతే భావనా ప్రపంచం కేవలం ఆస్ట్రల్ ప్రపంచమో, కేవలం కారణ ప్రపంచమో, ఈ చేష్టా ప్రపంచం అన్నది భూ ప్రపంచానికి సంబంధించినది. ఇది కురు క్షేత్రం. ఇది కార్యక్షేత్రం. ఈ క్షేత్రం గురించి అంటే మూడవ క్షేత్రమైన "చేష్టా క్షేత్రం" గురించి, "కురుక్షేత్రం" గురించి, "కార్యక్షేత్రం" గురించి మనం సవివరంగా తెలుసుకుందాం.

ప్రపంచంలో రకరకాల మనుష్యులు వున్నారు. మొట్టమొదటగా మానవ శరీరంలో ప్రవేశించినవారు వున్నారు. మానవ శరీరంలో

ప్రవేశించి పది జన్మలు తీసుకున్న వాళ్ళు వున్నారు. ఐదు వందల జన్మలు తీసుకున్న వాళ్ళు వున్నారు. వీళ్ళందరి స్వభావాలు ఒకే రకంగా వుండవు. మొట్టమొదటిలో "తమో గుణ ప్రధాని" గా వస్తాడు - మానవుడు. కొన్ని జన్మలు తీసుకున్న తర్వాత మెల్లిమెల్లిగా ఆ గుణం మారిపోతూ, మారిపోతూ "రజోగుణ ప్రధాని" గా తయారవుతాడు. ఆ తర్వాత మెల్లిగా, మెల్లిగా మారుతూ, మారుతూ "సత్వ గుణ ప్రధాని" గా వస్తాడు. ఆ తర్వాత ఇంకా మెల్లిగా మెల్లిగా మారుతూ "నిర్గుణి" అయిపోతాడు.

అంటే రకరకాల గుణ సంశయాలలో కూడి వున్నారు మానవులు! మరి రకరకాల ఈ మానవుల కార్యక్రమాలు ఏ విధంగా వుంటాయి? ఒకే రకంగా వుంటాయా? అంటే, వుండవు! రకరకాల గుణ సంచయాలు గల మానవుల బహిర్ కార్యకలాపాలు, ఇంకొకరి కార్యకలాపాలతో ఏకం కాజాలవు. అది అసంభవం.

ఒకానొక తమోగుణ ప్రధానమైన వాడి కార్యకలాపాలు ఆ గుణానికి సంబంధించినవిగా పూర్తిగా ఆ గుణానికి అంకితమై, ఆ గుణానికి ప్రతి రూపమై, ప్రతిఛాయ అయి వుంటాయి. అలాగే ఒక రజోగుణ ప్రధానమైన వాని కార్యకలాపాలు రజోగుణ ప్రధానమై వుంటాయి. ఒకానొక తమోగుణ ప్రధానమైన వాడి కార్యకలాపాలు, ఒకానొక రజోగుణ ప్రధానమైన వాడితో సమానంగా వుండజాలవు. అది అసంభవం! ఎలా వుంటాయి? ఏ వంట తింటే చేతికి ఆ వాసనే కలుగుతుంది. టమోటా వంట చేస్తున్నప్పుడు చేతికి కాకరకాయ వాసన వస్తుందా? అలాగే మనం అంతరంగా ఏ గుణం కలిగి ఉంటామో, మన బహిర్ కార్యకలాపాలు కూడా ఆ గుణానికి సంబంధించినవిగానే వుంటాయి కానీ, వేరే గుణానికి సంబంధించినవిగా వుండవు. అది అసంభవం అసహజం! అలా వుండవు.

అలాగే, ఒకానొక రజోగుణ ప్రధానమైన వాని కార్యకలాపాలు ఒకానొక సత్వగుణ ప్రధాని యొక్క కలాపాలుగా వుండజాలవు. ఈ సత్వగుణ ప్రధాని యొక్క కార్యకలాపాలు ఎలా వుంటాయి? అతడు చక్కటి సంగీతం వింటాడు! చక్కగా భజనలు చేస్తాడు! లేకపోతే చక్కగా ఆటపాటలలో వుంటాడు. రజోగుణ ప్రధాని పాలిటిక్స్‌లో వుంటాడు. వారికి అదే కావాలి.

అలాగే ఒక సాత్విక గుణ ప్రధాని యొక్క కార్యకలాపాలు ఒక నిర్గుణి యొక్క కార్యకలాపాలులాగా వుండవు. నిర్గుణ ప్రధానమైనవాడు ఎప్పడూ ధ్యానం చేస్తూ వుంటాడు - ధ్యానం చెప్తూ వుంటాడు - ధ్యానం

చేయిస్తూ వుంటాడు- ధ్యానం గురించే మాట్లాడుతూ వుంటాడు. కేవలం సత్వగుణ ప్రధాన కార్యకలాపాలలో అంటే సంగీతంలో, భజనలలో, ఆటపాటలలో, ఫైన్ ఆర్ట్సులలో నిర్గుణ ప్రధానులు వుండరు!

కనుక చెప్పేది ఏమిటంటే మానవుడు బహిర్ కార్యకలాపాలూ, కార్యక్షేత్రాలూ, కర్మక్షేత్రాలూ వారి వారి అంతర్ గుణాల నిస్సహాయ బందీలు! అంతర్ గుణాలు ఎలా వుంటాయో వారి బహిర్ కార్యాలు కూడా అచ్చుగా పోత పోసినట్లుగా అలాగే వుంటాయి! Your deads are natural shadows of your gunas!

మీ కార్యకలాపాలు మీ స్వధర్మం యొక్క పరిఛాయలు మీ గుణం ఒక రకంగానూ, కార్యం ఒక రకం గానూ వుండటం అసంభవం. ఈ గుణం అనేది అంత త్వరగా మారుతుందా? మారదు. ఎంతో మెల్లిమెల్లిగా మారుతూ వుంటుంది. కనుక ఎవరి కార్యకలాపాలను కూడా నిందించ ఎవ్వరూ అర్హత లేని వాళ్ళం. ఎందుకంటే చిన్నపాప లాంటి ఆత్మ అలానే నడుస్తాడు; కొన్ని జన్మలే ఎత్తాడు, యాభై జన్మలు ఎత్తలేదు. అంచేత అలానే వుంటాడు. ఐదు జన్మలకు ఏ ఏ స్వభావాలు వుంటాయో అవే వుంటాయి. యాభై జన్మలకు ఏ ఏ గుణాలు వుంటాయో ఆ గుణ గణాలే వుంటాయి. అలాగే ఓ వెయ్యి జన్మలు తీసుకున్న వాడు ఏ ఏ పనులు చేస్తాడో ఆ పనులే చేస్తాడు.

కనుక తప్పు ఎక్కడ వుంది? 'తప్పు' అనేది లేనే లేదు! తప్పు పట్టడం అన్నింటికన్నా పెద్ద తప్పు! కనుక మానవుడు కొన్ని జన్మల్లో తమోగుణిగా పుట్టాల్సిందే. మరి కొన్ని జన్మలు రజోగుణపరంగా వుండాల్సిందే! మరి కొన్ని జన్మలు సత్వగుణంగా వుండవలసిందే! చివరగా నిర్గుణంగా అయి తీరుతాడు. కనుక ఎవ్వరినీ తప్పు పట్టవలసిన పనిలేదు.

"Judge ye not" అని అన్నాడు, జీసస్ క్రైస్ట్! ఒక ప్రాస్టిట్యూట్‌ని రాళ్ళతో కొట్టబోతుంటే "మీలో తప్పు చేయని వాళ్ళు ఎవరో వాళ్ళు మాత్రమే రాళ్ళతో కొట్టండి" అని అన్నాడు. అందరూ రాళ్ళు క్రింద పడేశారు. ఎవరి స్థాయిలలో వాళ్ళు తప్పులు చేస్తూ వుంటారు; ఒప్పులు చేస్తూ వుంటారు. కనుక ఎవ్వరిని తప్పులు పట్టే సమర్థత లేనివాళ్ళం! అలాగే ఎవ్వరి చేష్టలను కూడా నిందించకూడదు! ఎవ్వరి చేష్టలనూ నిందించ అర్హత లేని వాళ్ళం.

ఈ లోకంలోనే కాదు ఏ లోకంలో అయినా సరే!

"చేష్టా ప్రపంచం" అనేది అంతర్ గుణ ప్రపంచం యొక్క బందీ.

భగవద్గీతలో అంటాడు కృష్ణుడు... తమో, రజో, సాత్విక గుణాలు ప్రకృతి సహజం! అవి ప్రకృతి ఒడిలో నుంచి వచ్చాయి!

అవి "నువ్వు" కాదు!

నీ చేష్టలు "నువ్వు' కాదు!

నీ రజో గుణం "నువ్వు" కాదు!

నీ తమో గుణం "నువ్వు" కాదు!

నీ సాత్వికం "నువ్వు" కాదు!

నువ్వు గుణ రహితుడవి!

అది నీ వస్తుతః నీయొక్క ప్రకృతి.

మిగతా ప్రకృతిలా రజో, తమో, సాత్విక గుణాలు తమంతట తాము పనిచేస్తూపోతుంటాయి. నువ్వు వాటికి సాక్షీభూతుడివికా, సాక్షిమాత్రుడివికా, వాటిని పట్టించుకోవలసిన అవసరం లేదు. వాటిని పట్టించుకోవలసిన అర్హత లేదు. మనం నడుస్తూంటే మన నీడని మనం పట్టించుకోం. మనం ఎటువైపు వెళితే మన నీడ అటువైపు సహజంగానే వస్తుంది. మనం ఆగిపోతే అదీ ఆగిపోతుంది.

నిజమైన క్రియాశీలక మనం, ఎవరయ్యా అంటే "వాక్ క్షేత్రం..." మనం ఇప్పుడు మూడో క్షేత్రానికి వచ్చాం.

## వాక్ క్షేత్రం

మొట్టమొదటిది భావనాక్షేత్రం. రెండవది వాక్ క్షేత్రం. మూడవది చేష్టా క్షేత్రం.

ఈ చేష్టా క్షేత్రంలో కూడానూ కృష్ణుడూ, అర్జునునితో ఏం చెప్పాడు అంటే "యధేచ్ఛసి తథాకురు" అన్నాడు, భగవద్గీత అయిపోయింది. చెప్పేదంతా ఆయన చెప్పేశాడు. తన వాక్ క్షేత్రంలో నుంచి ఏ వాక్కులు సంధించాలో, బయటికి తీసుకురావాలో అవన్నీ సంధించేశాడు; ఆయన బయటికి తీసుకువచ్చేశాడు.

తర్వాత, "నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు చేయవయ్యా!" అన్నాడు. "నా ఇష్టం వచ్చినట్లు నువ్వు చేయవయ్యా" అని చెప్పలేదు!" నీ స్వధర్మం ఎలా అనిపిస్తుందో, నీ స్వగుణం ఎలా నిన్ను ప్రేరేపిస్తుందో అలానే చెయ్యి; అలాగే విలసిల్లు; నా అనుగుణంగా నువ్వు విలసిల్లడం కాదు. 'అప్పో దీపో భవ!" అన్నాడు.

"యధా ఇచ్ఛసి తథాకురు" ..... చూశారా! "కురు" అంటే "కర్మ",

"చేష్ట!" "నీ ఇష్టమొచ్చినట్లు చెయ్యి; వదిలి పెట్టేసి ఇంటికెళ్ళి విచారణ చేసుకుంటావా? నీ ఇష్టం! లేదూ గాండీవం తీసుకుని అందరినీ సంహరిస్తావా? నీ ఇష్టం! నీకు ఏది ఇచ్ఛగా ఉందో అది చెయ్యి. చంపుతావా చంపు. పరుగెత్తి పారిపోతావా పరుగెత్తి పారిపో. నీ ఇష్టం. నీ చేష్టలు నీ ఇష్టం. నీ చేష్టా ప్రపంచం నీ ఇష్టం. నా ఆలోచన ప్రకారం, నా వాక్కు ప్రకారం, నా బుద్ధి ప్రకారం నువ్వు జీవించవద్దు. నీ బుద్ధి ప్రకారం నువ్వు జీవించు. నీకు ఏది తోస్తే అది చెయ్యి. ఇందులో గర్హించదగినది ఎక్కడా లేదు. చంపు! ఎవ్వరికీ నిన్ను గర్హించడానికి అర్హత లేదు. పరుగెత్తిపో! ఏమో, అది చేస్తే చెయ్యి. అదీ చేయగలవేమో కూడా, నాకేమో నువ్వు చేయలేవేమో అనిపిస్తుంది."

ఉదా: గాండీవం వదిలిపెట్టేసి మూడడుగులు వెనుక వేస్తావనుకో. నీ విరోధి నవ్వుతాడు! గేలిచేస్తే వెంటనే నీకు ఉక్రోషం వచ్చి, దాని చేత వేధింపబడి వెంటనే గాండీవం పూని మళ్ళీ వాళ్ళనంతా విధ్వంసం చేస్తావు. అది మటుకు నాకు తెలుసు నీ గురించి! నీ గురించే నీకింకా తెలియదు! ఓ అర్జునా! నువ్వూ నేను ఎన్నో జన్మలు ఎత్తాము! నాకు అంతా తెలుసు. నాకు నీ జన్మలూ తెలుసు. నీకే నీ జన్మలు తెలియదు. అందుకోసం ఏడుస్తున్నావు. నువ్వు ఏ గుణ సంపన్నుడివో ఆ కార్య సంపన్నుడివికా! ఆ చేష్టా సంపన్నుడివికా! అక్కడే నీకు ఆనందం వుంటుంది. అంటే యథా ఇచ్ఛాసి తథాకురు.

ఈ కురుక్షేత్రంలో, కార్యక్షేత్రంలో నీకిష్టమొచ్చినట్లు చెయ్యి. చంపుతావా? చంపు! మానభంగం చేస్తావా మానభంగం చెయ్యి! ఆ తర్వాత పోలీసులు వాళ్ళిష్టమొచ్చినట్లు వాళ్ళు చేస్తారు! నువ్వేం చేస్తావో నువ్వు చెయ్యి! పోలీసులు ఏం చేస్తారో వాళ్ళు చేస్తారు! కనుక, కార్యక్షేత్రంలో మనం సర్వపరతంత్రులం. మన కార్యాలన్నీ మన గుణాల ఆధీనంలో వుంటాయి. మీకో చిన్న ఉదాహరణ.

ఒక రోజేమయిందంటే, ఇరవై అయిదు సంవత్సరాల వెనుక నేను నెలకు 25 రోజులు టూర్ చెయ్యాలి. ఇంటి దగ్గర భార్యతో ఉండేది చాలా తక్కువ. ఒకసారి మా ఫ్రెండ్స్ అందరితో కలిసి ఒక వేశ్యాగృహం దగ్గరికి వెళితే బాగుంటుంది అనుకున్నాను. మిగతా అందరికీ మామూలే. నేను కూడా వెళ్ళాను. అక్కడ దాకా వెళ్ళాను! కానీ, తిరిగి వచ్చేశాను. నావల్ల కాలేదు. నా గుణం బట్టే కార్యం. కార్యం చేయడానికి సిద్ధమే. కానీ గుణం ఒప్పుకోలేదు. వెంటనే తిరిగి వచ్చేశాను. చూశారా మరి!

నా కార్యం నా గుణానికి బంధి. నాకు కాదు బంధి. అది ప్రకృతి సహజం. ఎవరి కార్యకలాపాలు వారి వారి గుణసంచయానికి అద్దం పడతాయి. కృష్ణుని కార్యకలాపాలు కృష్ణుని యొక్క ఆత్మ పరిణితికి అద్దం పడతాయి. కంసుని యొక్క కార్యకలాపాలు వాని యొక్క ఆత్మ దశకు అద్దం పడతాయి. ఓ శైశవ ఆత్మ, ఓ పిల్ల ఆత్మ, మహావృక్ష ఆత్మ అయిన కృష్ణుని ఆత్మ కార్య కలాపాలతో ఢీకొంటే ఎలా ఉంటుంది? కంసుడు, కృష్ణుని చేతిలో చచ్చాడు. అంటే కంసుడికి స్వర్గ ప్రాప్తి. అంటే కంసుడు తన గుణానుసారం చేశాడు.

భయం లేకుండా వుంటే కనుక అందరికీ స్వర్గ ప్రాప్తే! కంసుడి కేంటి, కృష్ణుడికేంటి? ఎవరికి ఎక్కడా లోటుండదు. ఎక్కడా నరక ప్రాప్తి లేదు కనుక. అందరికి స్వర్గప్రాప్తే. దుఃఖం ఎక్కడైనా వుందంటే అది ఈ లోకంలో ఉంది కానీ పై లోకంలో అది ఎక్కడా లేదు. దుఃఖం ఎక్కడైనా వుందంటే అది వారి వారి భావనా ప్రపంచం నుండి క్రియా ప్రపంచానికి తీసుకురాబడిందే. కాని స్వతహాగా సృష్టిలో ఎక్కడా దుఃఖం లేదు.

మన ఇష్టాఇష్టాలను బట్టి మన ఆలోచనా ప్రపంచం.

మన గుణాలను బట్టి మన కార్య ప్రపంచం.

భావనా ప్రపంచంలో మనం సర్వ స్వతంత్రులం.

కార్య ప్రపంచంలో మనం సర్వ పరతంత్రులం.

అలాగే ఇంకో చిన్న ఉదాహరణ.

ఇస్లాం మతస్థాపకుడు మహమ్మద్ పెద్ద పెద్ద యుద్ధాలల్లో ఉన్నాడు. నాస్తిక, ఆస్తిక యుద్ధాలు. మహమ్మద్ ఆస్తికుడు. అక్కడున్న వాళ్ళంతా నాస్తికులు. లేకపోతే విగ్రహారాధకులు. మహమ్మదు నిర్గుణోపాసకుడు. వాళ్ళకి వీళ్ళకి యుద్ధం. ఆ విషయాల్లో అనేక యుద్ధాలు జరిగాయి. ఒకసారి మహమ్మద్ క్రింద పడిపోయాడు. ఆ నాస్తికుడు మహమ్మద్ మెడ మీద కత్తి పెట్టేసి "ఇప్పడు నీ అల్లా రక్షిస్తాడా? ఎక్కడున్నాడు నీ అల్లా? నిన్ను చంపేస్తున్నాను" అన్నాడు. అప్పడూ మహమ్మద్ ప్రశాంతంగా వున్నాడు. చిరునవ్వుతో అన్నాడు. వాడి కళ్ళలో సూటిగా చూశాడు. "నా అల్లా నన్ను రక్షిస్తాడు!" అలాంటి సమయంలో కూడా, అలాంటి శాంతమైన మెత్తటి మాటలు వినేసరికి వాడు దద్దరిల్లి పోయాడు. వాడి చెయ్యి కంపించసాగింది. ఆ చెయ్యి కంపించడంతో వాడి కత్తి క్రిందపడింది. వెంటనే మహమ్మద్ ఆ కత్తి తీసి అతని మెడ మీద పెట్టి "ఇప్పడు నిన్నెవరు రక్షిస్తారు? నీకు అల్లా లేడు కదా? నువ్వు ఎవరికి మొరపెట్టుకుంటావు?"

వాడికి భయం; వాడి తమోగుణం ప్రకారం వాడు చేశాడు.

నిర్భయుడైన మహమ్మద్ వాణ్ణి చంపలేదు. అతడు శరణు కోరాడు. ఇతను శరణు ఇచ్చాడు. - అంటే ఎవరెవరి గుణాల ప్రకారం వాళ్ళు అలా చేసుకుంటూ పోతారు. కనుక ఒకరి కార్యకలాపాల్ని మనం దూషించలేం. మరి దేన్ని దూషించాలి? అటు భావనా ప్రపంచాన్నీ దూషించలేం! ఇటు కార్య ప్రపంచాన్ని దూషించలేం! మధ్యలో వున్న ప్రపంచమే దూషణ భూషణాలకు అర్హత కలది.

ఇప్పుడు మనం ఈ రెండవ ప్రపంచంలోకి వస్తున్నాం. రెండవ క్షేత్రంలోకి వస్తున్నాం. దీన్ని మనం "వాక్ క్షేత్రం" అంటాం. మొదటి భావనా క్షేత్రంలో మనం సర్వస్వతంత్రులం. చేష్టా క్షేత్రంలో మనం సర్వ పరతంత్రులం. చేష్టా క్షేత్రంలో మన గుణాలకే మనం బందీలం! ఈ గుణం ఎక్కడి నుండి వస్తుంది? మన అనేకానేక జన్మ కర్మల సముచ్ఛయమే, మన వాసనల సముదాయమే మన గుణం. గుణాలు మారవని కాదు! చాలా మెల్లిమెల్లిగా మారుతూంటాయి. ఎంతో కాలానికి చిన్న చిన్న మార్పులతో ముందుకు సాగుతుంది. అది పెను మార్పులకు తావులేనిది.

పెను మార్పులు ఎక్కడ చేయగలమంటే రెండవ ప్రపంచంలో చేయగలం. అదే వాక్ ప్రపంచం. వాక్ క్షేత్రం! రెండవ క్షేత్రం అన్నది పలుకుల క్షేత్రం. జీసస్ క్రైస్ట్ అద్భుతమైన వాక్కులు మనకు మళ్ళీ ఇక్కడ పనికి వస్తాయి. నిజానికి జీసస్ క్రైస్ట్ గురించి ఎంత ఆలోచిస్తే అంత మహనీయత బయటికి వస్తుంది. ఆయన " What goes into the mouth. that does not defileth a person. What comes out of the mouth that defileth a person" అన్నారు. "నోట్లోకి ఏం పోతుందో అది మానవుణ్ణి నాశనం చేయదు! నోట్లో నుంచి ఏది బయటికి వస్తుందో అది మానవుణ్ణి నాశనం చేస్తుంది!" అంటే చేష్టల గురించి ఆయన ప్రస్తావించలేదు. వాక్కుల గురించే ఆయన ప్రస్తావించాడు. అంటే నీ నోట్లో నుంచి ఏది బయటికి వస్తుందో అది వాక్కై బయటికి వస్తుంది.

తలలో నుంచి తలపులు వస్తాయి. నోట్లో నుంచి వాక్కులొస్తాయి. కాయంలో నుంచి కర్మలొస్తాయి. తలపులు, చేష్టలు తమంతట తాము సాగుతూంటాయి. మరి ఈ మధ్యలో ఉండే రెండవదైన, తలకీ, కాయానికి మధ్య అనుసంధానమైన, కారణానికీ, కార్యానికీ మధ్య సన్నిహితమైన, మధ్యదైన వాక్ ప్రపంచం, అత్యంత కీలకమయినది.

వాక్ క్షేత్రంలో.........

అక్కడ తప్పలు వున్నాయి.

ఒప్పలు ఉన్నాయి.

సరిగ్గా చేయడం కూడా వుంది.

సరిగ్గా చేయకపోవడం కూడా ఉంది.

అక్కడ సమర్థత ఉంది.

అసమర్థత ఉంది.

అక్కడ స్పష్టత ఉంది.

స్పష్టతా లోపం ఉంది.

శాస్త్రీయత ఉంది, అశాస్త్రీయత ఉంది.

సందర్భోచితం ఉంది.

సందర్భోచితం లేకుండా కూడా ఉంది.

కనుక, "సరి చేసుకోవలసిన జీవితం ఏదయ్యా?" అంటే అదే వాక్ ప్రపంచం! మానవుడికి మూడు క్షేత్రాలు. భావనా క్షేత్రం, వాక్ క్షేత్రం, చేష్టాక్షేత్రం. మొదటిది మనం ఏమీ చేయనక్కరలేదు. మూడవది మనం ఏమీ చేయలేం. రెండవ ప్రపంచంలో మాత్రం ఎన్నో చేయగలం! కనుక చేసి తీరాలి! వాక్ ప్రపంచాన్నే సరిదిద్దుకోవాలి. ఇదే ప్రధాన ప్రభోధం. మానవులందరూ ఏం చేస్తుంటారంటే ఎక్కడ సరిచేసుకోనవసరం లేదో అక్కడ సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎక్కడైతే సరిచేయలేమో అక్కడ కూడ సరిచేయటానికి ప్రయత్నిస్తారు. రెండూ అజ్ఞానపు చేష్టలే! జ్ఞానపు చేష్టలు కావు! ఏమిటి నిజమైన జ్ఞానపు చేష్ట అంటే రెండవ క్షేత్రమైన వాక్ క్షేత్రంలో మొత్తం సరిచేసుకోవాలి.

భగవద్గీతలో మొదటగా అర్జునుడు తన విషాదమంతా వెళ్ళగక్కు కున్నాడు. "ఆ విషాదం ఎక్కడి నుంచి వచ్చింది?" అంటే అజ్ఞానపు మాటలు, "వాడు నా తండ్రి", "వీడు నా గురువు", "వాడు నా సోదరుడు". "వాళ్ళను ఎలా చంపాలి?" అన్నాడు. వాస్తవానికి ఎవడు నీ తండ్రి? ఎవరు నీ సోదరుడు? ఎవరు నీ తాత? ఎవరు నీ గురువు? "భజగోవిందం"లో శంకరాచార్యుల వారు చెప్పారుగా...

**"కస్త్వం కోహం కుత ఆయాతః కామే జననీ, కోమే తాతః?"**

"ఎవరు నీ తల్లి? ఎవరు నీ తండ్రి? ఇదంతా కూడానూ స్వప్నం నాయనా!" అని ఆయన అన్నారు. అర్జునుడు విషాదం వెళ్ళగక్కితే, కృష్ణుడు "Stop! హే అర్జున్ ! ఆఫ్ బాత్ నహీ కర్‌నా! నువ్వు తప్పగా మాట్లాడుతున్నావు. నీ మాటలు నువ్వు సరిచేసుకో. నీ మాటలు

సత్యదూరం. సత్య వాక్కులేమిటో నేను చెప్తాను" అని చెప్పేసి అద్భుతమైన గీతామృతం ఇచ్చాడు.

అర్జునుడి విషాద యోగం అర్జునుడి వాక్ క్షేత్రంలో నుంచి వచ్చింది. శ్రీకృష్ణుడి భగవద్గీత శ్రీకృష్ణుడి వాక్‌క్షేత్రంలో నుంచి వచ్చింది. శ్రీకృష్ణుడు అర్జునుడి వాక్కులను సరిచేయడానికే పూనుకున్నాడు కానీ అతని చేష్టలను కాదు. చివరగా "యధోచ్ఛసి తథాకురు..." అన్నాడు. "నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి" . గీత అంతా చెప్పాక "ఓ అర్జునా! నేను చెప్పినట్లు చెయ్యి" అనలేదు. ఎందుకంటే ఎవరి కర్మలనూ, ఎవరి చేష్టలూ మనం సరిచేయలేం! అది అసంభవం!

కర్మల్లో, చేష్టల్లో మనం సర్వ పరతంత్రులం. భావనల్లో మనం సర్వస్వతంత్రులం. వాక్కుల్లో మనం సర్వస్వతంత్రులమూ కాజాలదు; సర్వ పరతంత్రులమూ కాజాలదు. మన వాక్కులు సత్యవాక్కులుగా వుండాలి. అవి బుద్ధి రహితమైన వాక్కులుండరాదు. శాస్త్ర ధోరణిలో ఉన్న వాక్కులుండాలి. సైంటిఫిక్ టెంపర్ ఉన్న వాక్కులుండాలి. శాస్త్ర ధోరణికి వ్యతిరేకమైన వాక్కులుండకూడదు. అది గర్హించదగినది. ఖండించదగినది, తృణీకరించదగినది, పరిత్యజించవలసినది.

కనుక మన పిరమిడ్ మాస్టర్లు ఏం చేస్తూంటారంటే ఎవరైనా మాటలు మాట్లాడుతూంటే "సరిగ్గా మాట్లాడవయ్యా" అంటాం. "మాటలు సరిచేసుకో" అంటాం. కృష్ణుడు అర్జునుడితో అదే అన్నాడు.

**"అశోచానన్వస్త్వం ప్రజ్ఞావాదాంశల భాషసే।**
**గతాసూన్ అగతాసూన్‌చ నానుశోచంతి పండితాః॥"**

"నువ్వు ఏడవకూడని దాని కోసం ఏడుస్తూ గొప్ప గొప్ప మాటలు నాకే చెప్తావా? నీకే అర్హత వుందయ్యా, గొప్ప గొప్ప మాటలు మాట్లాడటానికి? నువ్వు గొప్పవాడివి అయితే కదా! నీ లెవల్‌కు తగ్గ మాటలు మాట్లాడు. నీ లెవెల్‌కు తగని మాటలు మాట్లాడవద్దు. నీకేమీ తెలియదు. నీకు పుట్టుకంటే తెలియదు. జన్మ అంటే తెలియదు; చావంటే తెలియదు; మంచి అంటే తెలియదు, చెడు అంటే తెలియదు. నీకేమీ తెలియదు, ఏం తెలియకుండా మాట్లాడుతున్నావు. తెలియనప్పుడు మౌనంగా ఉండు, తెలిసినప్పుడే మాట్లాడు. కనుక, నీవు మాట్లాడింది తప్పు' అని చక్కగా ఆయన ఖండించాడు, వివరించాడు, విశ్లేషించాడు, సరిచేశాడు. అతని మాటలను సరిచేశాడు కానీ చేష్టలను సరిచేయలేదు.

భగవద్గీత అయిన తర్వాత కూడానూ డైరెక్ట్‌గా విన్న అర్జునుడు కూడానూ తన కొడుకు అభిమన్యుడు వధించబడినప్పుడు వలవలా ఏడ్చాడు! ఒకవేళ కర్మలను సరిచేయగలిగి ఉంటే అర్జునుడు ఏడ్చి వుండేవాడు కాదు కదా! ఏ అజ్ఞాని, వెంటనే జ్ఞాని కాలేడు. జ్ఞానం రావాలంటే, అఖండమైన ధ్యానసాధన ఉండాలి. అది జన్మల కర్మల సముచ్ఛయం.

కృష్ణుడంతటి వాడు రాయబారం చేసి దుర్యోధనుడి దగ్గరికి వెళ్ళి కొన్ని కర్మలు చేయమని అడిగాడు. కానీ వాడు చేశాడా? ఐదూళ్ళయినా ఇచ్చాడా? ఎవరికైనా ఇంకొకరి కర్మలను సరిచేయడం అన్నది అసాధ్యం. "జానామి ధర్మః నచమే ప్రవృత్తిః, జానామి అధర్మః నచమే నివృత్తిః" అన్నాడు! "నాకు ధర్మం అంటే ఏమిటో తెలుసు. కానీ చేయాలని లేదు. నాకు అధర్మం అంటే ఏమిటో తెలుసు. కానీ నాకు అదే చేయాలని ఉంది!" ఇంక వాణ్ణి ఎవరేం చేస్తారు? ఎవరి చేష్టలు వారివే! ఎవరేం చేయలేరు! ప్రతి వారి చేష్టలనూ మనం చూస్తుండాలంతే. వాటిని సరిచేయలేం. చేష్టలు సవరింపబడవు. చేష్టలు వారి వారి స్వగుణాలకు, స్వధర్మాలకు బందీలు కనుక, చేష్టా క్షేత్రంలో మనం ఎవరినీ పట్టించుకోకూడదు.

అలాగే భావనాక్షేత్రం. అక్కడ కర్మలు లేవు. అది బీజం. అక్కడ సమంజసాలు లేవు. శుభాశుభాలు లేవు! సరియైనవి, సరికానివి అక్కడ లేవు! ఎక్కడున్నాయంటే రెండవ క్షేత్రంలో - వాక్ క్షేత్రంలో! అక్కడ చక్కగా, కరెక్ట్‌గా, శాస్త్రీయంగా, సత్య సమ్మతంగా, సత్యానికి దగ్గరగా ఉండాలి. 'మంచి', 'చెడు' గా కాదు ఉండవలసింది. సత్యానికి దగ్గరగా, సత్యంలో లీనమై, సత్యంతో ఏకమై ఉండాలి. వాటిని "సత్యవాక్కులు" అంటాం.

మానవ జీవితం త్రిక్షేత్రమయం. భావనాక్షేత్రం, వాక్ క్షేత్రం, చేష్టా క్షేత్రం. ఈ మూడింటిలో మనం పట్టించుకోవలసిందీ, శ్రద్ధ తీసుకోవలసిందీ, మనల్ని మనం తీర్చిదిద్దుకోవలసిందీ, పక్కవాళ్ళ నుంచి శిక్షణ తీసుకోవలసిందీ, పక్క వాళ్ళకి శిక్షణ ఇవ్వవలసింది ఈ రెండవ క్షేత్రమైన వాక్‌క్షేత్రం. అందుకే జీసస్ అన్నాడు " What goes into the mouth, that does not defileth a person. What comes out of the mouth that defileth a person"." ఏది నోట్లోకి పోతుందో అది నిన్ను పాడు చేయదు! ఏది నోట్లో నుంచి వస్తుందో అది నిన్ను పాడుచేస్తుంది; దాన్ని సవరించుకో!"

మన మాటల్ని సవరించుకోవడాన్నే "జ్ఞాన యోగం" అంటాం!

ఎలాగైతే సంగీతం బాగా వచ్చిన వారి దగ్గర మనం సంగీతం నేర్చుకుంటామో, మాటలు బాగా మాట్లాడే వారి దగ్గర చేరి మాటలు బాగా మాట్లాడటం నేర్చుకుంటాం! సత్యవాక్కులున్న వారి దగ్గర చేరి మనం సత్యవాక్కులు నేర్చుకుంటాం! మన మాటలు మన ఆలోచనల నుంచి రాకూడదు. మన మాటలు విజ్ఞుల మాటల ప్రకారం రావాలి. మీ ఆలోచనలు ఎలాగైనా ఉండవచ్చు. మీ మాటలు మట్టుకు సశాస్త్రీయంగా ఉండాలి. అలాంటి మాటలను బుద్ధుడి దగ్గరి నుంచి అరువు తెచ్చుకోండి; ఒక కృష్ణుడి దగ్గరి నుంచి అరువు తెచ్చుకోండి; ఒక జీసస్ నుంచి అరువు తెచ్చుకోండి.

ఉదా: తిరుపతి కంచి రఘురాంను నేను "ఓ వెయ్యిరూపాయలు ఇవ్వండి" అన్నాను. రఘురాం దగ్గర అయిదు రూపాయలు మాత్రమే వున్నాయి. "నా దగ్గర అంతలేదు, క్షమించండి" అంటాడా? అనడు! మీకు రూ.1000/- అప్పు తెచ్చి మరీ ఇస్తాడు. ఎలాగైతే డబ్బు లేకపోతే పక్కవాళ్ళ దగ్గర నుంచి ఇప్పిస్తామో, అలాగే మీ దగ్గర బుద్ధి లేదు. కనుక ప్రక్కవాళ్ళ బుద్ధి అరువు తెచ్చుకోండి. మీ దగ్గర సత్యవాక్కులు లేవు. కనుక కృష్ణుడి సత్యవాక్కులు అరువు తెచ్చుకోండి. మీ ఆలోచనల నుండే మీ వాక్కులొస్తే మీరు నాకు మొండి చేయి చూపించినట్లు! మీ ఆలోచనలు మీ ఇష్టం. వాక్కులు మటుకు మీ ఇష్టం కాదు. మీ కార్యాలు ఇష్టాఇష్టాల ద్వారా కాదు, అవి ప్రకృతి సహజం.

కనుక వాక్కులను సరిచేసుకోండి. పిరమిడ్ మాస్టర్లు సరిగ్గా మాట్లాడతారు. పిరమిడ్ మాస్టర్లందరికీ ఇది అనుభవమే. ఎవరైనా తప్పు మాట్లాడితే వెంటనే నేను తప్పు పడతాను! ఎవరైనా "గుడ్ మార్నింగ్" అంటే "ఏమయ్యా 'బ్యాడ్ మార్నింగ్' ఎక్కడైనా వుందా?" అంటాను. ప్రతి ఒక్కరు వచ్చి "బాగున్నారా! సార్"? అంటే "ఎందుకు బాగుండను? నేనేమైనా రోగినా? నేనేమైనా హాస్పటల్ నుంచి వచ్చానా? నీకు పిచ్చి పట్టిందా? బాగా వున్నవాణ్ణి చూసి బాగున్నారా అని అడుగుతారా? నీకు బుద్ధి లేదా? నీ బుద్ధి గడ్డి తినిందా?" అని వెంటనే అంటాను! ఇది అందరికి తెలుసు. చేష్టల తీరును నేనెప్పుడూ పట్టించుకోలేదు. నేనెప్పుడూ పట్టించుకునేది మాటల అశాస్త్రీయాన్నే! "పైన తిరుమలలో దేవుడున్నాడు" అంటే, "నువ్వు చూశావా? విగ్రహం ఉంది. సరిగ్గా మాట్లాడు! 'దేవు'డెక్కడున్నాడు? విగ్రహం చూడ్డానికి వెళ్ళానని ఒప్పుకుంటాను. దేవుణ్ణి చూడటానికి వెళ్ళానంటే తప్పు. కనుక అవి సత్యవాక్కులు కావు" అంటాను!

మానవ జీవితం, మానవ ప్రపంచం త్రిక్షేత్రమయం. మొదటిది భావనాక్షేత్రం, రెండవది వాక్ క్షేత్రం, మూడవది చేష్టాక్షేత్రం. భావనాక్షేత్రం నీ ఇష్టం. కార్యక్షేత్రం, అది తనంతకు తాను జరిగేది. ప్రకృతి సహజం. మన ప్రమేయమున్నదీ, మనం జీవించవలసిందీ, మనల్ని మనం సరిచేసుకోవలసిందీ, కేవలం వాక్ క్షేత్రంలో! ఇదీ వాక్ క్షేత్రం గురించి సమగ్రమైన సంపూర్ణమైన విశ్వరూపం!

-బ్రహ్మర్షి పత్రీజీ

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుఢ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

- బ్రహ్మర్షి పత్రీజీ